ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాలి

- అసెంబ్లీలో ప్రజాగళం వినిపించండి
- ప్రజాప్రతినిధులకు ప్రజల విన్నపాలు
- రైతు, ఉపాధి, సాగు తదితర అంశాలపై దృష్టి సారించాలని వినతి

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రంలో టీడీపీ– బీజేపీ– జనసేన కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. కూటమి తరఫున ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు అధికారం కట్టబెట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శక పాలన సాగించడంతో పాటు కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రశంసలు పొందింది. ఇంతకు మించిన పాలన అందిస్తామని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చెబుతోంది. అయితే రెండు నెలలు గడుస్తున్నా ఆ మార్క్ కనిపించ లేదు. ఖరీఫ్‌లో రైతులకు సాయం, ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి, పరిశ్రమల స్థాపనతో ఉపాధి, సాగు–తాగునీటి సాధన, మేనిఫెస్టో హామీల అమలుపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు గళమెత్తాలని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.


హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువ (ఫైల్)

రైతులకు మేలు చేయండి..


హంద్రీనీవా కాలువ గుండా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన నాలుగు ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు హంద్రీనీవా కాలువ ద్వారా నేరుగా పేరూరు డ్యాంకు నీరు తీసుకెళ్లాలి. వీటి ద్వారా ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీలో మాట్లాడి నిధుల మంజూరుకు చొరవ తీసుకోవాలి.

– ఈశ్వర్, నరసంపల్లి, కనగానపల్లి మండలం

హంద్రీ–నీవా కాలువలకు నీరొదలండి


గత ప్రభుత్వంలో హంద్రీ–నీవా కాలువ పనులు పూర్తి అయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకొని తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా, వలసలు నివారించడానికి హంద్రీ–నీవా కాలువలకు నీరు వదిలేలా ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లాలని రైతులందరం కోరుకుంటున్నాం

– టి.ఎరమరెడ్డి, ఉబ్బరవాండ్లపల్లి, తలుపుల మండలం

ఫ్యాక్టరీలు రావాలి


నేను డిగ్రీ వరకు చదివాను. ఈ ప్రాంతంలో చదువుకున్న వారు ఉద్యోగాల కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. కరువుకు నిలయమైన కదిరి ప్రాంతానికి ఫ్యాక్టరీలు రావాలి. అందులో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– జగదీశ్వర్‌రెడ్డి, మాచిరెడ్డిపల్లి, కదిరి మండలం

నిరుద్యోగులకు దారి చూపండయ్యా..


మన ప్రాంతంలో చదువుకుని ఉద్యోగాలు లేక యువత అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలి. యువత ఉద్యోగాలు లేక ఇతర ప్రాంతాల వలస వెళ్తున్నారు. ఇంకా కొంతమంది వేరే ఊళ్లకు వెళ్లలేక వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత నిరుద్యోగులకు దారి చూపాలి.

– అశోక్‌కుమార్, పైలబోయలపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

నీరు, శ్మశానవాటికలపై దృష్టి సారించాలి


బత్తలపల్లి మండలంలో ప్రధాన సమస్యలు పరిష్కరించండి. పలు గ్రామాల్లో శ్మశానాలకు స్థలాలు లేవు. బత్తలపల్లిలో హిందూ శ్మశానవాటిక లేకపోవడంతో రోడ్డు పక్కనే శవాలను ఖననం చేస్తున్నారు. ఇదే పరిస్థితి చాలా గ్రామాల్లో నెలకొంది. గ్రామాల్లో సత్యసాయి నీరే దిక్కుగా మారింది. సత్యసాయి నీరు రాకపోతే గ్రామాల్లో పరిస్థితి దుర్భరంగా ఉంటుంది. గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నాం. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి వీటిపై దృష్టి సారించాల్సి ఉంది.

–అప్పస్వామి, గంటాపురం, బత్తలపల్లి మండలం

చెరువులకు నీరివ్వండి


గత ప్రభుత్వంలో సాధించిన 193 చెరువులకు నీళ్లు నింపి సాగునీరందించేలా ప్రస్తుత పుట్టపర్తి ఎమ్మెల్యే అసెంబ్లీలో గళం వినిపించాలి. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి. పారదర్శక పాలనతో ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని కోరుకుంటున్నాం.

– ఇద్దె భాస్కర్‌రెడ్డి, ఓడీ చెరువు

పెట్టుబడి సాయం అందజేయాలి


కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా రైతుల సంక్షేమానికి కృషి చేయాలి. పంటల సాగుకు రూ.20 వేల సాయం వెంటనే అందజేస్తే రైతులకు ఉపయోగపడుతుంది. ఎమ్మెల్యే సునీత గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలి. అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధి చేయాలి. పంచాయతీల వారీగా నిధులు మంజూరు చేయాలి.

– రాజేష్, పేరూరు, రామగిరి మండలం

వలసలు నివారించండి


వర్షాలు లేక రైతులు చాలా అవస్థలు పడుతున్నారు. మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు వర్షాధారిత పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. పంటల సాగుకు పెట్టుబడులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. లేకపోతే ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఉంది. రైతులకు వ్యక్తిగత రుణాలు ఇచ్చి ఆదుకోండి. వంద శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలి.

– లింగన్న, సీపీఎం నాయకుడు, చెన్నేకొత్తపల్లి మండలం

పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి


వెనుకబడిన పుట్టపర్తి నియోజకవర్గంలో వీలైనన్ని పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. 193 చెరువులకు కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగు, తాగునీటి కొరత తీర్చాలి. నల్లమాడ వద్ద పాలిటెక్నికల్ కళాశాల భవన సముదాయాలు నిర్మించాలి. గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలి. మేనిఫెస్టోలోని సూపర్ 6 పథకాలను వెంటనే అమలు చేయాలి. వీటిపై స్థానిక శాసనసభ్యురాలు పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించాలి.

–ఎం.గంగాధర్, సీపీఐ జిల్లా నాయకులు, నల్లమాడ

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి


అమడగూరు మండలంలో 35 శాతం మంది ఉపాధి కోసం వలసలు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలకు జీవనాధారంగా ఏవైనా పరిశ్రమలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. మండలం మీదుగా పక్కనే కర్ణాటక ప్రాంతానికి అనుసంధానం చేస్తూ నేషనల్ హైవే నిర్మిస్తే ఈ ప్రాంతానికి విలువలు పెరగడమే కాకుండా జీవనోపాధి లభిస్తుంది.

– నవీన్‌రెడ్డి, యువ రైతు, రెడ్డివారిపల్లి, అమడగూరు మండలం

ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలి


గత ఎన్నికల ప్రచారం ఉమ్మడి కూటమి ప్రకటించిన విధంగా ఇంటింటికి ఒక ఉద్యోగం లేదా ఉద్యోగం లభించని వారికి నిరుద్యోగ భృతి అయినా అందించాలి. నిరుద్యోగ భృతి అందించి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలి. డిగ్రీ వరకు చదువుకున్న ఎందరో నిరుద్యోగులు పెట్రోలు బంకుల్లోనూ, ఉపాధిహామీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ భృతిపై ప్రకటన విడుదల చేయాలి.

– బి.పెద్దిరాజు, నిరుద్యోగి, తాడిమర్రి

హామీలు నెరవేర్చాలి


ఎన్నికల సమయంలో కూటమి తరఫున విద్య, వ్యవసాయానికి సంబంధించి ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలి. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది విద్యార్థులు చదివితే అంతమందికీ సాయం అందించాలి. ఖరీఫ్‌లో పంటల సాగుకు రైతులు ఇబ్బందులు పడకుండా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు మంజూరు చేయాలి.

– షేక్ అస్లాం, ఎస్‌పీకుంట

క్లుప్తంగా

బోధన సామగ్రి ప్రదర్శన


బోధన సామగ్రి ప్రదర్శిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాలలోని వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన చేస్తున్నామని ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌లు తెలిపారు. బీఎస్‌ఆర్ పాఠశాలలో విద్యార్థినులు తయారు చేసిన బోధన సామగ్రిలను వారు పరిశీలించారు. ఆకర్షణమైన ప్రాజెక్టులను తయారు చేయించినందుకు హెచ్‌ఎం ఉమాపతిని అభినందించారు.

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

బత్తలపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. భూ సమస్యలపై నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా రామమోహన్


రామమోహన్‌కు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఓబిలేసు

పుట్టపర్తి: ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా ఈదులపల్లి రామమోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుంటిమద్ది ఓబిలేసు కార్యదర్శి గంగిశెట్టి సమక్షంలో సోమవారం పుట్టపర్తి సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో రామాంజనేయులు, మద్దిలేటి, కేశప్ప, నాగేష్, బాబు, అనిల్, వెంకటేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

రామగిరి: గంతిమర్రి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు, ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు హాజరయ్యారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, అట్టలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, శివయ్య, విజయ్‌కుమార్, ఉమామహేశ్వర్, వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మావతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సోమవారం డీఎం మైనొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కోసం ఇచ్చిన సర్క్యులర్ 1–2019 అమలు చేయాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లకు టిమ్ మిషన్ డ్యామేజీపై రూ.6 వేలు రికవరీ చేయడం అన్యాయమన్నారు. గ్యారేజీలో ఉద్యోగులకు డైనింగ్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే ఉద్యోగుల విశ్రాంతి గదుల్లో తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో గ్యారేజీ షెడ్లు లీకేజీ అవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు రామక్రిష్ణ, ఓబులేసు, బైరిశెట్టి, రామ్మోహన్, డీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రిట్ గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్లతో విద్యార్థులు, యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యా సంస్థలో ఇంజినీరింగ్‌తో పాటు యూరప్‌లోని రైజ్ కంపెనీ ఆధ్వర్యంలో రిట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. డీన్ బాలకోటేశ్వరి, ప్రిన్సిపాల్ సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ ఆస్ట్రియాలోని వియన్నా యూనివర్సిటీ ప్రొఫెసర్ పాల్ స్పిల్ బర్గర్ రూపొందించిన ప్రోగ్రాంలో మొత్తం 8 మాడ్యూల్స్ ఉంటాయన్నారు. రెండేళ్ల కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ అందజేసి విదేశీ విద్యకు మార్గం సుగమం చేస్తారన్నారు. కళాశాలలో 30 మంది విద్యార్థులు ఈ కోర్సు పూర్తి చేసినట్లు చెప్పారు. దీంతో పాటు గ్రాజ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కొన్రాడ్ జలార్ పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

చెన్నేకొత్తపల్లి: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎన్‌ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రవినాయక్ ఆయా పాఠశాలల సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల పాఠశాలను వైద్య సిబ్బందితో కలసి సందర్శించారు. బాలికల హాస్టల్ వెనుక మురికి నీరు నిల్వ ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. మురుగు తొలగించాలని సిబ్బందికి సూచించారు. నీరు ఇలా నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయన్నారు. దోమకాటుకు గురైతే జ్వరాలు సోకుతాయని హెచ్చరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అలాగే కేజీబీవిలో విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తగు జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గోవిందమ్మ, పీహెచ్‌ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్లు రామలక్ష్మమ్మ, వెంకట నారాయణ, ఆరోగ్య కార్యకర్తలు వెంకటేష్, భాస్కర రెడ్డి, ఏఎన్‌ఎం సుశీల, ఎంఎల్‌హెచ్‌పీ వనజతో పాటు ఆశావర్కర్లు, ఆయా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రవినాయక్

స్థానిక వనరులతో బోధన

బత్తలపల్లి: స్థానికంగా ఉన్న వనరులతోనే బోధన చేయాలని ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలతో పాటు మండలంలోని సంజీవపురంలోని కేజీబీవీ, నల్లబోయనపల్లి, మాల్యవంతం, రామాపురంలోని ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' వారోత్సవాలు నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులు స్థానికంగా ఉన్న వనరులతో బోధన సామగ్రి తయారు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా చెప్పాలన్నారు. విద్యార్థులు కూడా తమ ఆలోచనలకు అనుగుణంగా బోధన సామగ్రి తయారు చేసుకుని ప్రదర్శనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


బత్తలపల్లిలో విద్యార్థులు తయారు చేసిన బోధన సామగ్రి నమూనాల ప్రదర్శన

ఏడో రోజూ న్యాయవాదుల నిరాహార దీక్ష


నిరాహార దీక్షలు చేపడుతున్న న్యాయవాదులు

కదిరి టౌన్: కదిరి న్యాయవాది రామస్వామినాయుడిపై దాడి చేసిన బీజేపీ నాయకుడు తలుపుల గంగాధర్, అతని అనుచరులును వెంటనే అరెస్ట్ చేయాలని న్యాయవాదులు కోర్టు సమీపంలో చేపట్టిన నిరాహార దీక్షలు ఏడో రోజు సోమవారమూ కొనసాగాయి. దాడి చేసిన వారినే వెంటనే అరెస్ట్ చేయాలని, లేకపోతే ఆమరణ దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సురేంద్ర చౌదరి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధన సామగ్రి పరిశీలన


పరిశీలిస్తున్న అబ్జర్వర్ అబ్రహం లింకన్

కదిరి అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ (బోధన సామగ్రి) శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర పరిశీలకుడు అబ్రహం లింకన్ పరిశీలించారు. 27 వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని మండల విద్యాధికారి చెన్నక్రిష్ణ తెలిపారు. అటానమీ, పెర్‌సర్వైనెన్స్, సోషల్ కొలాబరేషన్ మూడు ఎలిమెంట్స్‌పై ఇచ్చిన శిక్షణపై పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అసిస్టెంట్ జీసీడీఓ సంపూర్ణతో పాటు 9 మండలాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

డబ్బు అడిగిందని భార్యపై దాడి


చికిత్స పొందుతున్న నల్లమ్మ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో వెంకటేష్ తన భార్య నల్లమ్మపై దాడిచేసి గాయపరిచాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... సోమవారం సాయంత్రం ఇంట్లో సరుకులు అవసరమై రూ.50 ఇవ్వండని భార్య అడిగితే ఆగ్రహించిన వెంకటేష్ గొడవ పెట్టుకున్నాడు. కోపోద్రిక్తుడై కర్రతో తలపై బాదాడు. గాయపడిన నల్లమ్మను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

డీఎల్‌పీఓ సుడిగాలి పర్యటన

నల్లచెరువు: ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ అంజనప్ప ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ నసీమతో కలిసి సోమవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలోని పురాతన వాటర్ ట్యాంక్‌తో పాటు విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజన్నాన్ని పరిశీలించారు. అనంతరం నల్లచెరువు, తవళంమర్రి, పంతుల చెరువు, కె.పూలకుంట గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుపాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు వసుంధర, రమణప్ప నాయుడు, గోపీనాథ్, కిషోర్ పాల్గొన్నారు.

పీర్ల గ్రామోత్సవం

కొత్తచెరువు: కొడపగానిపల్లిలో సోమవారం పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. గుండం చుట్టూ గ్రామస్తులు ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను, ద్విచక్రవాహనాలు తిప్పారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఏటా కుల, మత, పార్టీలకు అతీతంగా గ్రామస్తులందరూ ఐక్యతతో మొహర్రం వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రఘునాథరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పెద్దసరిగెత్తు

బత్తలపల్లి: మండలంలోని నల్లబోయనపల్లి, ముద్దనపల్లి, దంపెట్ల, సంగాల, అప్పరాచెరువు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి.

బాబాకు లక్ష కుసుమార్చన పూజలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాయినగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని రెండోరోజు సోమవారం లక్ష కుసుమార్చన పూజలు నిర్వహించారు. అలాగే ఏకాహం, అభిషేకం, మధ్యాహ్న హారతి తదితర పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు బంధనాథం సూర్యప్రకాష్, రాంప్రసాద్, హేమంత్‌కుమార్, జీసీ నాయుడు, సూర్యనారాయణ, రామలింగయ్య, వీరనారాయణ పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లమాడ: బాసంవారిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్ద తిరుపాల్‌రెడ్డి భార్య సునందమ్మ (43) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సూచనతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి గ్రామానికి విచ్చేసి సునందమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సూర్యనారాయణ, ఎంపీటీసీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదు కమిటీ ఎన్నిక

గాండ్లపెంట: మండల కేంద్రంలో జామియా మసీదు నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముతవల్లిగా ఉమర్ ఆలీసాబ్, ఉప ముతవల్లిగా ఖాజామొహిద్దీన్, కార్యదర్శిగా అక్బర్‌సాబ్, ఉప కార్యదర్శిగా సయ్యద్ ఫారుక్, కోశాధికారిగా పామిడి మహమ్మద్‌రఫీ, మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు కోశాధికారి రఫీ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నల్లమాడ: ఆర్.రామాపురం బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామాంజనేయులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, సూపర్‌వైజర్ మహబూబ్ బాషా సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి: ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సోమవారం వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి హౌసింగ్, ఉపాధి తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం

కనగానపల్లి: వేపకుంటలో సోమవారం ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు జ్యోతులు ఎత్తుకుని ఊరేంపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామి, పోతలయ్య స్వామి, అక్కమ్మగార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఎంఈఓ–1 ఖాదర్‌వలి సూచించారు. ఆయన సోమవారం పుట్టపర్తి శివాలయం వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించి.. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించుకొని రుచి చూశారు. సంతృప్తి వ్యక్తం చేశారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

గాండ్లపెంట: మండల కేంద్రం గార్లదిన్నెలో కదిరికి చెందిన మహమ్మద్‌రఫీ, ఇర్ఫాన్, జాబీర్ అనే ముగ్గురు అనుమానితులను ఎస్‌ఐ క్రిష్ణవేణి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరు గంజాయి సేవించినట్లు అనుమానం రావడంతో వారిని కదిరి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.

కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

ధర్మవరం అర్బన్: మున్సిపల్ కాంట్రాక్ట్ వాటర్ సప్లయ్ పంప్ ఆపరేటర్ బొగ్గు వెంకటరాముడు(52) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వాటర్ సప్లయ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ నాయకులు మహేష్, దాసరి సురేష్ తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

నేటి నుంచి ఇంటర్ పుస్తకాల పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి ఇంటర్ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. ఎమ్మార్సీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కేజీబీవీ, మోడల్ స్కూల్, బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు కిట్ల రూపంలో పాఠ్య పుస్తకాలు అందిస్తామన్నారు. కోట మున్సిపల్ పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు.

బీజేపీ నాయకుడిపై చర్యలు తీసుకోండి

పుట్టపర్తి టౌన్: కదిరి బీజేపీ నాయకుడు తలుపుల గంగాధర్ పార్టీని అడ్డుపెట్టుకొని దౌర్జన్యాలు, కబ్జాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కదిరి అడ్వకేట్ అసోసియేషన్ సభ్యులు ఎస్పీ రత్నను కోరారు. సోమవారం పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. సభ్యులు మాట్లాడుతూ గత నెల 28న కదిరి అడ్వకేట్ రామస్వామినాయుడిపై గంగాధర్ దాడి చేసి, భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. గంగాధర్ చేస్తున్న దౌర్జన్యాలు, దాడులు, కబ్జాలకు అసాంఘిక కార్యకలాపాలపై విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.